కర్రెగుట్టల్లో కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలు (ఫైల్)

# మాటల్లేవ్.. ఎన్‌కౌంటర్లే!

**మావోయిస్టులతో చర్చలకు కేంద్రం విముఖత**

**వ్యూహాత్మకంగా భద్రతా బలగాల అడుగులు**

- 50వేలకు పైగా బలగాలతో ఆపరేషన్ కగార్
- మావోయిస్టుల కీలక స్థావరాల స్వాధీనం
- బంటీలుగా ఇద్దరు సెంట్రల్ కమిటీ సభ్యులు
- హిడ్మా అర్బన్ ప్రాంతాల్లో ఉన్నట్టు అనుమానం
- ఆచూకీ కోసం భద్రతా బలగాల ముమ్మర వేట

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపేందుకు ఇటు కేంద్ర ప్రభుత్వం కానీ, అటు మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలు కానీ సిద్ధంగా లేవని తెలుస్తున్నది. తాము శాంతి చర్చలకు సిద్ధమని, కేంద్రం 'సీజ్‌ఫైర్' ప్రకటించాలని మావోయిస్టులు పదేపదే లేఖలు విడుదల చేస్తున్నా, కాల్పుల విరమణ ప్రకటించినా కేంద్రం మొండిగా ముందుకు వెళ్తున్నదని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, వ్యక్తుల జీవించే హక్కులను కాలరాస్తూ ఎన్‌కౌంటర్లకే బీజేపీ ప్రభుత్వం మొగ్గు చూపుతున్నదని పౌర హక్కుల నేతలు విమర్శిస్తున్నారు. 2026 మార్చి నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామన్న ప్రకటనకు కట్టుబడిన మోదీ సర్కారు మానవ హననానికి పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మానవతావాదులు, ఎన్జీవోల ప్రతినిధులు, పౌర హక్కుల నేతలు శాంతి చర్చల కమిటీగా ఏర్పడి కేంద్రానికి, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్ర, ఒడిశా, మహారాష్ట్ర ప్రభుత్వ పెద్దలను సంప్రదించినా ఎటువంటి ఫలితం లేకపోయింది. కాల్పుల విరమణకు శాంతిచర్చల కమిటీ సభ్యులు కోరుతున్నా, మావోయిస్టులు డివిజన్లు, రాష్ట్రాలు, కేంద్ర కమిటీలవారీగా లేఖలు రాస్తున్నా కేంద్రం మాత్రం 'చర్చల్లేవ్.. ఎన్‌కౌంటర్లు మాత్రమే' అంటూ తుపాకులతో సమాధానం ఇస్తున్నది.

### అడుపులోకి ఒక్కో ప్రాంతం..

తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు కేంద్రం 50 వేల మంది బలగాలతో అడవుల్లో మోహరించి వ్యూహాత్మకంగా ఒక్కో ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకుంటున్నది. ఎక్కడికక్కడ ఫార్వర్డ్ ఆపరేషన్ బేస్(ఎఫ్‌వోబీ) క్యాంపులు ఏర్పాటు చేసుకుంటున్న భద్రతా బలగాలు యుద్ధ తంత్రాలను అనుసరిస్తున్నాయి. మావోయిస్టుల ప్రాబల్య విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గిస్తూ, వారిని ఒక ప్రాంతానికే పరిమితం చేసుకుంటూ, బయటకు వెళ్లే మార్గాలను దిగ్బంధిస్తూ లోనికి చొచ్చుకెళుతున్నాయి. మావోస్టులకు ప్రధాన స్థావరమైన ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులోని కర్రెగుట్టల్లో వరసగా ఎన్‌కౌంటర్లు జరిపి 21 రోజుల్లో 31 మందిని హతమార్చి ఆ స్థావరాన్ని స్వాధీనం చేసుకున్నాయి. అలాగే అబూజ్‌మడ్‌లో కోవర్టు ఆపరేషన్ నిర్వహించి మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు (బసవరాజు) సహా 27 మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేసి ఆ ప్రాంతాన్ని కూడా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. అలాగే మావోయిస్టులకు కీలక ప్రాంతాలైన బడేసెట్టి, మహారాష్ట్ర గడ్చిరోలి లోని కటేజారి వంటి వాటిని స్వాధీనం చేసుకున్నాయి. అందుకే మొన్నటి వరకు ఛత్తీస్‌గఢ్ లోని 9 జిల్లాల్లో పూర్తిగా ఆధిపత్యం చలాయించిన మావోయిస్టులు ఇప్పుడు కేవలం 2 జిల్లాలకే పరిమితమయ్యారు.

### టార్గెట్ మడావి హిడ్మా

గెరిల్లా యుద్ధాలు చేసి భద్రతా బలగాలను దెబ్బతీసిన మడావి హిడ్మానే ప్రధాన లక్ష్యంగా ఆపరేషన్ కగార్ కొనసాగుతున్నట్టు భద్రతా బలగాలు చెప్తున్నాయి. 'పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ' కి చీఫ్‌గా ఉన్న హిడ్మా తన దళంలో అత్యాధునిక ఆయుధాలను ఉపయోగిస్తుంటాడని సమాచారం. హిడ్మా స్కెచ్ వేస్తే భదత్రా దళాల్లో జరిగే నష్టం ఎక్కువగా ఉంటుందని ఇప్పటికీ బలగాలు చెప్తుంటాయి. ఆ పదునైన వ్యూహాల వల్లనే అతడు మావోయిస్టు కేంద్ర కమిటీలో కీలక నేతగా ఎదిగాడని అంటారు. ఇప్పటికే కేంద్ర కమిటీలో కీలకంగా ఉన్న తెలుగు రాష్ట్రాలకు చెందిన సీనియర్ నేతలను ఒక్కొక్కరిని ఎన్‌కౌంటర్ చేస్తున్న బలగాలు కేంద్రం సుక్మా నుంచి ఆ స్థానం దక్కించుకున్న హిడ్మా కోసం ముమ్మరంగా గాలిస్తున్నది. అయితే, మడావి హిడ్మా అడవుల్లో లేడని, అర్బన్ ప్రాంతాల్లో ఉన్నట్టు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. తనపై దాడి జరిగినట్టు మీడియాను, బలగాలను దారి మళ్లించడం హిడ్మాకు కొత్తేమీ కాదని కొందరు చెప్తున్నారు. గతంలోనూ హిడ్మా చనిపోయినట్టు కూడా వార్తలు వచ్చాయి. కావాలనే ఇలాంటి డైవర్షన్ వ్యూహాలు చేస్తుంటాడని అంటుంటారు. పాఠశాల స్థాయి వరకే చదువుకున్న హిడ్మా ఇంగ్లిష్, హిందీ, తెలుగు, మరాఠీ అనర్గళంగా మాట్లాడతాడని చెప్తారు. అతడి ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ ద్వారా కొన్ని కిలోమీటర్ల అవతల ఉన్న భద్రతా దళాల కదలికలు కూడా పసిగడతాడని అంటుంటారు.

### ఏడాదిగా అడవుల్లో మారణహోమం

నిరుడు 350 మందికిపైగా మావోయిస్టులు, అమాయక గిరిజనులను భద్రతా బలగాలు పొట్టన పెట్టుకున్నట్టు పౌరహక్కుల సంఘాలు చెప్తున్నాయి. ఈ ఏడాది మొదటి 3 నెలల్లోనే 103 మందిని హతమార్చిన భద్రతా బలగాలు.. ఏప్రిల్, మే నెలల్లో మరో 100 మందికిపైగా మావోయిస్టులను కాల్చి చంపాయి. ఈ ఐదు నెలల్లో 209 మంది ఎన్‌కౌంటర్లలో చనిపోయినట్టు నివేదికలు చెప్తున్నాయి. ప్రస్తుతం భద్రతా బలగాల అదుపులో మావోయిస్టు నాయకులు బండి ప్రకాశ్, దిలీప్ సహా 10 మంది ఉన్నట్టు పౌర హక్కుల నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బందీలుగా పట్టుకున్న వారిని కోర్టులో హాజరుపర్చాలని కోరుతున్నారు. మావోయిస్టులు తప్పించుకునేందుకు వీలు లేకుండా ఉపగ్రహ నిఘా, డ్రోన్ల సాయంతో కాలు కదిపితే భద్రతా బలగాలు పట్టేస్తున్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో వ్యూహంతో భద్రతా బలగాలు పట్టు సాధిస్తుండటంతో కేంద్రం కూడా చర్చలకు ససేమిరా అంటున్నది. మావోయిస్టు రహిత దేశం కోసం కేంద్రం కంకణం కట్టుకొని ఆ దిశగా వ్యూహాలు రచిస్తున్నారు. కాల్పుల్లో పాల్గొన్న అధికారులకు కావాల్సిన ఆయుధాలు, ఆర్థిక సంపత్తి, కార్యచరణ అందిస్తున్నారు. గెరిల్లా యుద్ధతంత్రంలో చర్చలు అనేవి వ్యూహాత్మక ఎత్తుగడగానే అధికారులు భావిస్తున్నారు. చర్చల పేరుతో కార్యకలాపాలు నిలిపివేస్తే మిగిలిన మావోయిస్టులు తలోదిక్కుకు వెళ్లిపోయి మళ్లీ బలం పెంచుకుంటారని భావిస్తున్నారు. అందుకే చర్చల ప్రసక్తే లేదని, లొంగిపోవడం ఒక్కటే మావోయిస్టుల ముందున్న మార్గమని, లేకపోతే తూటాలకు బలికావాల్సిందేనని అంటున్నారు.

## 'ఆపరేషన్ కగార్'ను ఆపేయాలి : ఏఐవైఎఫ్

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు, అమాయక ఆదివాసీలపై క్రూరంగా దాడులు జరిపి భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. వెంటనే ఆపరేషన్ కగార్‌ను ఆపేయాలని ఏఐవైఎఫ్(అఖిల భారత యువజన సమాఖ్య) రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐవైఎఫ్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇటీవల జరిగిన మావోయిస్టుల హత్యలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రం కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 23న 'చలో రాజ్‌భవన్' నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఆఫీస్ బేరర్లు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, శ్రీనివాసులు, సత్యప్రసాద్, మహేందర్, శ్రీమాన్, కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు మహేశ్, ఉపేంద్ర, సల్మాన్ బేగ్, శివకుమార్, రాజేశ్, మహమూద్, మాజిద్, మహేశ్, మధు పాల్గొన్నారు.

## 20న బంద్‌కు మావోయిస్టుల పిలుపు

**లేఖను విడుదల చేసిన మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ ప్రతినిధి జగన్**

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తూ 20న తెలుగు రాష్ట్రాల బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ ఓ లేఖను విడుదల చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు టీఎల్ఎన్ఎస్ చలం అలియాస్ ఆనంద్, సుధాకర్, గౌతం, మైలారపు అడెలు అలియాస్ భాస్కర్‌తోపాటు మరికొందరిని బూటకపు ఎన్‌కౌంటర్ చేసిన కేంద్ర ప్రభుత్వ దమనకాండను తీవ్రంగా ఖండించాలని కోరారు. అటవీ, ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే ఉద్దేశంతో 550మందికిపైగా మావోయిస్టులను బూటకపు హత్యలు చేశారని మండిపడ్డారు. మే 21న మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ నంబాల బసవరాజ్‌తోపాటు 27మందిని పొట్టనపెట్టుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 3నుంచి నేషనల్ పార్క్‌లో మరో దాడిని నిర్వహించి ఏడుగురిని హత్య చేసినట్టు జగన్ తెలిపారు. మావోయిస్టు ప్రతినిధులు చర్చలకు ముందుకొచ్చినా.. కేంద్రం పట్టించుకోకుండా మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా పనిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలతో అటవీ ప్రాంతంలోని గిరిజనులు భయాందోళనలతో కాలం వెళ్లదీస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్ల నాటకాన్ని ఎండగడుతూ.. కగార్ దాడులను వ్యతిరేకిస్తూ ఈనెల 20న ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల్లో బంద్‌ను పాటించాలని లేఖలో కోరారు.

## ఐఐఎంఆర్‌లో జీసీవోఈఎం నిర్మాణం

**రాజేంద్రనగర్‌లో రూ.250 కోట్లతో ఏడాదిలో పూర్తి**

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : చిరుధాన్యాలపై ఆవిష్కరణలు, పరిశోధనలు, విస్తరణకు ప్రాధాన్యం కల్పించేందుకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ(ఐఐఎంఆర్)లో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఆన్ మిల్లెట్స్(జీసీవోఈఎం) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూ. 250 కోట్ల అంచనా వ్యయంతో 4 ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో దీన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పనులను ప్రారంభించారు. ఏడాదిలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఐఐఎంఆర్ డైరెక్టర్ తారా సత్యవతి వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా మిల్లెట్ల ఉత్పత్తి, ఉపయోగాన్ని ప్రోత్సహించడం, సాగులో వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ఉపయోగపడేలా ఐఐఎంఆర్‌లో జీసీవోఈఎం నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. జీసీవోఈఎం తెలంగాణకు, దేశానికి, ప్రపంచానికి ఓ వరమని, చిరుధాన్యాలను విశ్వవ్యాప్తం చేయడానికి దీన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

# 'సోలార్ ప్లాంట్ల'పై స్పష్టత కరువు!

**కేటాయించేది మండల సమాఖ్యలకా? జిల్లా సంఘాలకా?**

- మెగావాట్ ప్లాంట్ ఏర్పాటుకు 3 కోట్లు.. 4-5 ఎకరాలు
- ఖర్చులు భరించేది డిస్కంలా? ఇన్‌స్టలేషన్ కంపెనీలా?
- స్థలాల సేకరణకు అడుగడుగునా సవాలక్ష సమస్యలు
- ఆర్భాటంగా ప్రకటనలు.. విడుదలకాని మార్గదర్శకాలు

హైదరాబాద్ జూన్ 15 (నమస్తేతెలంగాణ): 'కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం. ఇందిరా మహిళాశక్తి కింద సమైక్య సంఘాలకు సోలార్ ప్లాంట్లను కేటాయించి అక్టోబర్ 2లోగా ప్రారంభిస్తాం. ఇప్పటికే ఇన్‌స్టలేషన్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నాం' అంటూ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పదే పదే ఆర్భాటపు ప్రకటనలు గుప్పిసున్నారు. కానీ ఆచరణలో ఈ దిశగా అడుగు ముందుకు పడిందిలేదు. కేటాయింపుపై స్పష్టత వచ్చిందీలేదు. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవమైన మార్చి 8 నుంచి ఊదరగొడుతున్నా ఇందుకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు నేటికీ విడుదల కాలేదు. సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు సవాలక్ష అవరోధాలను అధిగమించాల్సి ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం ఆ దిశగా కనీస చర్యలు చేపట్టలేదని పెదవి విరుస్తున్నారు. ఒక్క మెగావాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు దాదాపు నాలుగు నుంచి ఐదెకరాల స్థలం అవసరమని నిపుణులు చెప్తున్నారు. ప్లాంట్ల స్థాపనకు అవసరమైతే స్థలాలను లీజుకు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు. గత పదేండ్లుగా సాగువిస్తీర్ణం పెరుగుతుండటంతో ఖాళీ స్థలాలు కనిపించడమే లేదు. ఒకవేళ ఉన్నా భారీగా ధరలు పలుకుతున్నాయి. లీజుకు ఇచ్చేందుకు రైతులు, యాజమానులు ముందుకొచ్చే పరిస్థితులులేవు. మరీ ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో భూములను సేకరించడం అసాధ్యమని భావిస్తున్నారు. ఒకవేళ స్థలాలు అందుబాటులో ఉన్నా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుగుణంగా భూములను అభివృద్ధి చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందా? లేదా ఇన్‌స్టలేషన్ కంపెనీలు భరిస్తాయా? అనే విషయంలో స్పష్టతలేదని పేర్కొంటున్నారు.

### ఖర్చులు భరించేదెవరూ?

ఒక్క మెగావాట్ సోలార్ ప్లాంట్ నిర్మాణానికి సుమారు రూ.3 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేస్తున్నారు. ఈ ఖర్చులను భరించే విషయంలో అధికారులు స్పష్టమైన సమాధానాలు చెప్పడమే లేదు. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామని చెప్తున్నారు కానీ ఇందుకు బ్యాంకులకు గ్యారెంటీ ఇచ్చేది ప్రభుత్వమా? ఇన్‌స్టలేషన్ కంపెనీలా? అనే విషయంలోనూ క్లారిటీ లేదు. అలాగే ప్లాంట్ నుంచి గ్రిడ్లకు ట్రాన్స్‌మిషన్ లైన్లు వేసే విషయంలోనూ సవాలక్ష ఇబ్బందులు ఉన్నాయి. ఒక్కో కిలోమీటర్ ట్రాన్స్‌మిషన్ లైన్‌కు రూ.15 లక్షల ఖర్చవుతుందని నిపుణులు చెప్తున్నారు. ఈ ఖర్చులను డిస్కంలు భరిస్తాయా? గ్రామైక్య సంఘాలు పెట్టుకోవాల్సి ఉంటుందా? అనే విషయంలోనూ స్పష్టత కరువైంది.

### నిర్వహణ బాధ్యతలు ఎవరివి?

ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలను అప్పగించే విషయంలోనూ సర్కారుకు స్పష్టత కొరవడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామైక్య సంఘాలకా? మండల సమాఖ్యలకు ఇస్తారా? లేదంటే జిల్లా సమాఖ్యలకు అప్పగిస్తారా? అనే విషయంలోనూ సందిగ్ధత నెలకొన్నది. ఏ ప్రాతిపదికన నిర్వాహకులను ఎంపిక చేస్తారో తెలియడమే లేదు. ఒక్కో మెగావాట్ ప్లాంట్ ద్వారా నెలకు రూ.1.40 లక్షల వాట్ల సోలార్ కరెంట్ ఉత్పత్తి అవుతుందని నిపుణులు చెప్తున్నారు. వాట్‌కు రూ.3.13 చొప్పున విక్రయించడం ద్వారా రూ.4.5 లక్షల ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు. ఇందులో నిర్వహణకు రూ.53 వేల దాకా వెచ్చించాల్సి ఉంటుందని చెప్తున్నారు. మిగతా సుమారు రూ.4 లక్షల నగదు రూ.3 కోట్ల రుణం వడీకే సరిపోతుందని, అదికూడా 20 ఏండ్లు సుదీర్ఘకాలం బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుందని చెప్తున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్లాంట్ల ఏర్పాటు, నిర్వహణ ఏవిధంగా ఆచరణ సాధ్యమని సందేహాలు వ్యక్తంచేస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు కూడా ముందుకురావడం అనుమానమేనని పేర్కొంటున్నారు.

# అటకెక్కిన అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ!

- పోస్టుల భర్తీ కోసం 2 నెలల క్రితం జీవో విడుదల
- ఆందోళనకు దిగిన కాంట్రాక్ట్ అధ్యాపకులు
- నిరసనలతో జీవోను వెనక్కి తీసుకున్న ప్రభుత్వం
- నిబంధనల్లో మార్పులపై నోరు మెదపని సర్కారు

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. పోస్టుల భర్తీ కోసం రెండు నెలల క్రితం ప్రభుత్వం హడావుడి చేసింది. మార్గదర్శకాలతో జీవో విడుదల చేసింది. ఆ మార్గదర్శకాల వల్ల తమకు నష్టం జరుగుతుందని కాంట్రాక్ట్ అధ్యాపకులు అభ్యంతరాలు వ్యక్తంచేశారు. న్యాయం చేయాలంటూ 12 యూనివర్సిటీల పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులంతా ఆందోళనకు దిగారు. 13 రోజులకుపైగా అన్ని యూనివర్సిటీల్లో క్లాసులు బంద్ పెట్టి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పీజీలు, పీహెచ్‌డీలు పూర్తి చేసి ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఈ జీవో వల్ల అన్యాయం జరుగుతుందన్న మరో వాదన బయటకు వచ్చింది. మార్గదర్శకాల్లో మార్పులు చేసి, పోస్టులను భర్తీ చేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులతో పాటు విద్యార్థి సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వం ఆ జీవోను తాత్కాలికంగా వెనక్కి తీసుకున్నది. అయితే, నిరుద్యోగులకు అనుకూలంగా మార్పులు చేసి జీవోను మళ్లీ విడుదల చేస్తారా? అన్న విషయంలో మాత్రం స్పష్టత లేదు.

### దెబ్బతింటున్న వర్సిటీల ప్రమాణాలు

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను సకాలంలో భర్తీ చేయకపోవడం వల్ల యూనివర్సిటీల ప్రమాణాలు పడి పోతున్నాయని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల వర్సిటీ విద్యా విధానం కుంటుపడుతున్నదన్నారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,700 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

# హ్యామ్‌రోడ్ల పనులు చేయం

- పదేపదే మరమ్మతు టెండర్లు పిలిచినా స్పందన కరువు
- పెండింగ్ బిల్లులు చెల్లించట్లేదని కాంట్రాక్టర్ల అసంతృప్తి
- బిల్లులకు గ్యారంటీ ఇస్తేనే 'హ్యామ్' పనులు చేస్తామని వెల్లడి

హైదరాబాద్, జూన్ 15(నమస్తే తెలంగాణ): నిరుడు వానాకాలం పాడైన రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజానీకం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రమాదకరమైన ప్రయాణం సాగిస్తున్నారు. రోడ్లు మరమ్మతులకు ప్రభుత్వం టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడమే రోడ్ల దుస్థితికి కారణమని అధికారులు చెప్తున్నారు. రూ.300 కోట్లకు టెండర్లు పిలిస్తే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు విముఖత వ్యక్తంచేస్తున్నారని అంటున్నారు. సుమారు రూ.1000 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని, అందుకే కొత్తగా పనులు చేపట్టడం లేదని కాంట్రాక్టర్లు స్పష్టంచేస్తున్నారు. గత బిల్లుల సంగతే ఏటూ తేలని నేపథ్యంలో తాజాగా హైబ్రిడ్ యాన్యూటీ మోడ్(హెచ్ఏఎం)లో ఏకంగా రూ. 33వేల కోట్లతో 13వేల కిలోమీటర్లకు పైగా రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం మంత్రివర్గంలో నిర్ణయించిందని, వీటికి నిధులు ఇస్తుందన్న నమ్మకంలేదని కాంట్రాక్టర్లు పెదవి విరుస్తున్నారు.

### క్యాబినెట్‌లో రోడ్లపై నిర్ణయం

రాష్ట్రంలో రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం మంత్రివర్గంలో పలు నిర్ణయాలు తీసుకుంది. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు బీటీ రోడ్లు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్‌లేన్ రోడ్లు, జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు నాలుగు వరుసల రోడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపింది. దీని కోసం హ్యామ్ విధానాన్ని చేపడుతామని చెప్పింది. దశలవారీగా మొత్తం రూ. 28,000కోట్లతో 17,000 కిలోమీటర్లమేర ఆర్‌అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. పంచాయతీరాజ్ రోడ్లతో కలుపుకుంటే ఈ మొత్తం రూ.33,194 కోట్లకు, మొత్తం రోడ్ల పొడవు 13,137 కిలోమీటర్లకు చేరుతుందని తెలిపింది.

### మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుందట!

హ్యామ్ విధానం ప్రకారం ముందుగా కాంట్రాక్టర్లు 60శాతం నిధులు బ్యాంకుల ద్వారా సమకూర్చుకుంటే మిగిలిన 40శాతం ప్రభుత్వం దశలవారీగా చెల్లిస్తుంది. కాంట్రాక్టర్లు ఖర్చుచేసిన 60 శాతం మొత్తాన్ని 15సంవత్సరాల్లో టోల్ ట్యాక్స్ ద్వారా వసూలు చేసుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రోడ్లపై టోల్ వసూలుచేసే అవకాశం లేకపోవడంతో ఆ 60శాతం కూడా తామే దశలవారీగా చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇదంతా అనుమానమే అని కాంట్రాక్టర్లు అంటున్నారు. "అప్పులే పుడుతలేవని చెప్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. రోడ్ల ఖర్చు కాంట్రాక్టర్లు భరించాలని, తర్వాత చెల్లిస్తామంటే ఎలా నమ్ముతాం? నిరుడు వానకాలంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.1000 కోట్లు చెల్లించకుండా ప్రభుత్వం తిప్పలు పెడుతున్నది. ఇప్పుడు రూ.33వేల కోట్ల రూపాయలతో రోడ్లు నిర్మిస్తామని, కాంట్రాక్టర్లు ముందుగా జేబులో నుంచి ఖర్చు పెట్టుకోవాలని చెప్తే ఎవరైనా ఎలా నమ్ముతారు?" అని ఓ కాంట్రాక్టర్ ప్రశ్నించారు.

### కాంట్రాక్టర్ల బిల్లులే చెల్లించలే!

పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ కాంట్రాక్టర్లు కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. అప్పటివరకు కొత్త పనులు చేపట్టబోమని తేల్చిచెప్పారు. ఇటీవల కాంట్రాక్టర్లు సచివాలయంలో ఆందోళనకు దిగారు. అయినా కూడా వారి బిల్లులు విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం హ్యామ్ మోడల్‌లో ఏకంగా రూ. 33వేల కోట్ల విలువైన పనులు ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టాలని నిర్ణయించడంపై కాంట్రాక్టర్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. హ్యామ్ రోడ్లపై ఇటీవల అధికారులు పలువురు కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా పనులు చేపట్టే ప్రసక్తేలేదని సమావేశంలో కూడా కాంట్రాక్టర్లు తేల్చిచెప్పినట్టు తెలుస్తున్నది.

## సర్టిఫికెట్ల కోసం దివ్యాంగుల ఇక్కట్లు

- ఉపకరణాల దరఖాస్తుకు సర్కారు నోటిఫికేషన్
- దరఖాస్తులకు ఈ నెల 7 నుంచి 18 వరకు గడువు
- అప్లికేషన్‌కు కేవలం 11 రోజులు మాత్రమే అవకాశం
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ దివ్యాంగుల చక్కర్లు
- 30 వరకు పొడిగించాలని ఎన్‌పీఆర్డీ డిమాండ్

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): ఉపకరణాల దరఖాస్తు గడువు తరుముకొస్తుండటంతో దివ్యాంగులు పరేషాన్ అవుతున్నారు. దరఖాస్తుకు కేవలం పదకొండు రోజులు మాత్రమే అవకాశం ఇవ్వడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్కువ సమయం ఇవ్వడంతో అవకాశం కోల్పోవాల్సి వస్తుందేమోనని లక్షలాదిమంది దివ్యాంగులు ఆందోళనకు గురవుతున్నారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కాంగ్రెస్ సర్కారు ఈ నెల 3న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి పచ్చజెండా ఊపింది. రూ. 35 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మూడు రోజుల తర్వాత అంటే ఈ నెల 6న నోటిఫికేషన్ జారీ చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు ఈ నెల 7 నుంచి 18 వరకు గడువు విధించింది. అప్లికేషన్‌కు కేవలం 11 రోజులు మాత్రమే అవకాశం ఇచ్చింది. ఆధార్‌కార్డుతోపాటు కుల, ఆదాయ, సదరం ధ్రువీకరణపత్రాలను జత చేయాలని నోటిఫికేషన్‌లో నిర్దేశించింది. సర్టిఫికెట్ల కోసం 12 లక్షల మంది దివ్యాంగులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు సైతం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేశారు. అటు విద్యార్థులు, ఇటు దివ్యాంగ